క్లుప్తంగా

చలాన్లపై రాయితీని సద్వినియోగం చేసుకోండి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చలాన్లపై కల్పించిన రాయితీ సదుపాయాన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు సీఐ రమాకాంత్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌లపై ప్రభుత్వం భారీగా రాయితీ ప్రకటించిందన్నారు. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు 50శాతం నుండి 90శాతం వరకు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని, జనవరి 26వ తేదీ వరకు ఈ రాయితీ అందుబాటులో ఉంటుందన్నారు. తోపుడు బండ్లకు 90శాతం, ద్విచక్ర వాహనాలకు 80శాతం, ఫోర్‌వీల్, ఆటోలకు 60శాతం రాయితీ ఉందన్నారు. డిసెంబర్ 25 తర్వాత చలాన్లు పడిన వాహనదారులు వంద శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

బూర్గంపాడు: తెలంగాణ మలి దశ ఉద్యమకారులను కేసులతో సంబంధం లేకుండా ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు బాగి వెంకట్రావు అన్నారు. ఆదివారం బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రజా సంఘాల నాయకులను, విద్యార్థి సంఘాల నాయకులను, జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి సముచిత స్థానం కల్పించాలన్నారు. పోలీసు కేసులతో సంబంధం లేకుండా మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారికి ఆర్థిక భరోసాతో పాటుగా ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించాలని కోరారు. సమావేశంలో ఉద్యమ కారుల సంఘం నాయకులు పాడియం నరేందర్, తోడేటి సత్యనారాయణ, కొక్కొండ ప్రసాద్, పారుపల్లి శ్రీనివాస్, తన్నీరు వెంకటేశ్వర్లు, దాసరి సాంబయ్య, కొట్టె అనిల్, ఎస్‌కె.కరీమ్, దారా వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చర్ల: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండంలోని తిమ్మిరిగూడెంలో యూఎస్‌ఏకు చెందిన ప్రేరణ ఫౌండేషన్, సహృదయ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివాసీ గ్రామాలలో చలి తీవ్రత వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా.. తిమ్మిరిగూడెంలోని 50 కుటుంబాల వారికి ఒక్కొక్క కుటుంబానికి రెండేసి దుప్పట్ల చొప్పున అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు మహేష్ దుర్గా, సీపీఎం మండల కార్యదర్శి కారం నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, గణేష్ ఆటో యూనియన్ మండల కార్యదర్శి విజయబాబు గ్రామస్థులు మడకం రాజు, కట్టం జోగయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..


బూర్గంపాడు: ఎమ్మెల్యే పాయంను సన్మానిస్తున్న మహిళలు, నాయకులు

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మోతె గ్రామంలోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి కోసం ఎవరైతే పాలుపడ్డారో వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో దగ్గరికి రానివ్వనన్నారు. పార్టీ నాయకులు కూడా అలాంటి వారిని దగ్గరకు రానివ్వదన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడిన మిత్రపక్షాల నాయకులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయం, బ్రహ్మయ్యకు సన్మానం

అశ్వాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే నివాసంలో, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్యను మండల కేంద్రంలో సొసైటీ కార్యాలయంలో చవిటిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బూతం వెంకటేశ్వర్లు, తాడబోయిన వెంకటేశ్వర్లు, వలబోజు మురళీకృష్ణ, అక్కినపల్లి రమేష్, కిరణ్‌కుమార్, రామయ్య, శ్రీను, భిక్షమయ్య, కొర్లకుంట శ్రీనివాస్, నూకల లింగయ్య, ఉప్పయ్య, విజయ్, రాకేష్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మహబుబాబాద్ కాంగ్రెస్ నాయకులు ఎట్టి వెంకన్న ఆదివారం పాయం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి టిక్కెట్‌ను తనకు కేటాయించే విధంగా చొరవ చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయాన్ని ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి పదిగే నాగేశ్వరరావు, తుడుందెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య, ఆదివాసీ విద్యార్థి సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వజ్జా ప్రవీణ్, గుండాల మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మంగపేట సీనియర్ నాయకులు యలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ సందడి!


అశ్వారావుపేటరూరల్: రంగులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

అశ్వారావుపేటరూరల్: కొత్త ఏడాది సంబరాలతో నియోజకవర్గంలో సందడి నెలకొంది. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో న్యూ ఇయర్ సందర్భంగా ప్రధాన సెంటర్లతోపాటు, పలు గ్రామాల్లో రంగులు, స్వీట్లు, బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్‌ల వద్ద ప్రత్యేక సందడి నెలకొంది. అన్ని చోట్లా 2023కు వీడ్కోలు చెబుతూ 2024ను స్వాగతం పలుకుతా వేడుకలు జరుపుకున్నారు. యువకులు అర్ధరాత్రి కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు.

అన్నదానం అభినందనీయం

చర్ల: చర్లలో ప్రతీ ఆదివారం జరిగే వారపు సంతకు వస్తున్న ఆదివాసీలకు 'మీ కోసం మేమున్నాం' సహాయక కమిటీ ఆధ్వర్యంలో ఒక పూట అన్నం పెట్టే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని వ్యాపారవేత్త శెట్టి సాంబయ్య అన్నారు.

ఆదివారం చర్లలోని గాంధి సెంటర్‌లో 111వ వారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంత గ్రామాల నుంచి సరుకులు కొనుగోలు చేసేందుకు చర్లకు వచ్చే ఆదివాసీలకు జీవితకాలపు అన్నదానంలో భాగంగా ఆకలి తీర్చడం బృహత్తరమైందని అన్నారు. 111వ వారం అన్నదాన కార్యక్రమానికి బొజ్జా సీతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు అప్పలరాజు, సాంబయ్య అన్నదానానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మీ కోసం మేమున్నాం కమిటీ చైర్మన్ నీలి ప్రకాశ్, సభ్యులు నీలి ప్రసాద్, దొడ్డి తాతారావు, జవ్వాది సతీష్, నీలి సింహాచలం, దొడ్డి సూరిబాబు, దొడ్డా ప్రభుదాసు, కోమారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కట్టుబట్టలే మిగిలాయి..


దగ్ధమైన ఇంటి ఎదుట బాధిత కుటుంబం

కరకగూడెం: పైసా పైసా కూడబెట్టి సమకూర్చుకున్న వస్తువులన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. ఏళ్ల శ్రమ కళ్లెదుటే కాళీ బుడిదవ్వడంతో ఆ కుటుంబం కన్నీటి పర్యంతమయింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నర్సంపేట కాలనీకి చెందిన దొడ్డి సూర్యంకు చెందిన పూరింటిలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ అయింది. వైర్ల శబ్దాన్ని పసిగట్టిన కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. కానీ మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లోని టీవీ, దుస్తులు, వంట సామగ్రి, బియ్యం బస్తాలు, నగదు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్థి నష్టం వాటిల్లింది. అన్నీ అగ్నికి ఆహుతై కట్టుబట్టలతో మిగిలారు. నిరుపేద అయిన తమ కుటుంబాన్ని ఆదుకోవాని బాధితుడు ప్రభుత్వాన్ని వెడుకుంటున్నాడు. కాగా విషయం తెలుసుకుని కరకగూడెం డీటీ సంధ్య సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణగా అందించారు. అలాగే పలు పార్టీల నాయకులు సైతం ఆర్థిక సాయం చేశారు.

మౌలిక వసతుల కల్పనకు చేయూత

బూర్గంపాడు: ఐటీసీ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూతనందిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు జయంత్ కుమార్ దాస్ అన్నారు. బూర్గంపాడులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో వేయి లీటర్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆదివారం వాటర్ ట్యాంకు ప్రారంభించిన అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపుకు అవసర మైన వసతులను కల్పించేందుకు చేయూతనందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ అధికారులు చెంగలరావు, యాగి చంద్రశేఖర్, నాగ మల్లేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, కేవీఎస్ గోవిందరావు, శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రోశిరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డిని, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోశిరెడ్డి వారికి శ్రీసీతారామచంద్ర స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

ఎమ్మెల్యేకు వినతి

ములకలపల్లి: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల (సీఆర్‌టీ) వేతనాలు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్ట్ ఉపాధ్యాయల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి సమస్యలు విన్నవించారు.

శ్రీరామ అక్షింతల ఊరేగింపు


అశ్వారావుపేటరూరల్: అయోధ్య రామయ్య అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షింతలకు ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. హిందూ సంఘం అధ్యక్షులు జెట్టి వెంకటరాజు ఆధ్వర్యంలో భజన బృందం వారిచేత ఊరేగించారు. గ్రామంలోని అందరూ పాల్గొని అక్షింతలను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో బర్ల నాగేశ్వరావు, పిట్టా పూర్ణయ్య, జెట్టి విష్ణు, మోతుకురి సిద్ధార్థ, పాండవ కృష్ణా బజన మండలి జక్క సావిత్రి, వన్నాల మౌనిక, జెట్టి రాణి, రాయపూడి సరోజిని, పుట్టి రమణ, పుట్టి రోజా, తారా తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అయోధ్య రామయ్య అక్షింతలతో రామభక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయానికి అయోధ్య నుంచి రామయ్య అంక్షితలను కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ మేనేజర్ వేమూరి సుబ్రహ్మణ్యం ద్వారా చేరాయి. దాంతో అమ్మవారి ఆలయంలో అంక్షితలకు అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్షింతలను కలశాలలో ఉంచి ఆలయం వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్, రింగ్ రోడ్ సెంటర్, భగత్ సీంగ్ సెంటర్ మీదుగా రామభక్తులంతా కలిసి భక్తి శ్రద్ధలు, మేళతాళాలతో ప్రదర్శన నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రామభక్తుల ద్వారా రామయ్య అక్షింతలతోపాటు, అయోధ్య దేవాలయం చిత్రపటం, ఈ నెల 22న జరిగే ఆలయ ప్రతిష్ఠకు ఆహ్వాన పత్రికను ఇంటింటికీ అందజేస్తామని అన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మణుగూరురూరల్: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు తెలిపారు. ఆదివారం స్థానిక సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలకు, వినోద భరిత ఈవెంట్లకు ఎవ్వరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. కార్యక్రమాల పేరుతో టిక్కెట్లు, ఎంట్రీ ఫీజుల రూపంలో ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా వాహనాలను నిర్లక్ష్యంగా నడిపినా, మద్యం, మత్తు పదార్థాలు సేవించి నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజా రక్షణ కోసం సబ్ డివిజన్‌పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అదనపు సిబ్బందితో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.